కొత్తూరులో జోరుగా తెలుగుదేశం సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర - కొత్తూరు : కొత్తూరు మండలం పలు గ్రామాల్లో లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్ రావు టీమ్ సభ్యులు ద్వారా టీడీపి సభ్యత్వాలు నమోదు జోరుగా జరుగుతుంది. పాతపట్నం నియోజకవర్గం సీనియర్ నాయకులు లోతుగెడ్డ టీమ్ కర్లమ్మ ఆర్ అండ్ ఆర్ కాలనీలో సర్పంచ్ వుచ్చు అప్పారావు ఆధ్వర్యంలో, అలాగే మెట్టూరు బిట్ 1 పంచాయతి సర్పంచ్ అద పాకల శంకర్ రావు ఆధ్వర్యంలో, అలాగే మెట్టూరు బిట్ 2 టీడీపి నాయకులు పెదకోట ఆదినారాయణ అధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా లోతుగెడ్డ మాట్లాడుతూ ప్రజలకి టీడీపీ సభ్యత్వం ఒక భరోసా అని ఆయన అన్నారు.

బలమైన వామపక్ష వేదిక ఏర్పాటుకు కృషి : సీపీఎం జిల్లా మహాసభల్లో వామపక్ష నేతలు

విశాలాంధ్ర - పలాస : దేశంలోనూ, రాష్ట్రంలోనూ కార్పొరేట్ శక్తుల లూటికి వ్యతిరేకంగా, మతోన్మాద శక్తులను నియంత్రించ గల ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా బలమైన వామపక్ష వేదిక ఏర్పాటుకు సిపిఎం పార్టీ జిల్లా మహాసభలు నాంది పలుకుతాయని, ఆ దిశగా సిపిఎం పార్టీ నేతలు, వామ పక్ష పార్టీ నేతలు ఐక్యంగా ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బెండి తులసీదాస్ అన్నారు. సిపిఎం పార్టీ జిల్లా 18వ మహాసభలు సందర్భంగా రెండో రోజు ఆదివారం సాగిన ప్రతినిధుల సమావేశంలో తులసీదాస్ మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమానికి ప్రాణం పోసిన పలాస నేలపై సిపిఎం పార్టీ జిల్లా మహాసభలు నిర్వహించడం ఎంతో ఉత్తేజాన్ని ఇస్తుందని చెప్పారు. చారిత్రిక నేపథ్యం కలిగిన ఇక్కడ జరిగే మహాసభలు కమ్యూనిస్టు ఉద్యమం బలపడేందుకు దోహదపడతాయని అన్నారు. శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాట కాలంలో నిర్బంధాలు, అణిచి వేతలను ఎదుర్కొని పోరాటం చేసిన ఎందరో కమ్యూనిస్టు నేతల త్యాగాలను గుర్తు చేసుకోవాలని ఆయన కోరారు. వారందించిన స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నేడు ప్రపంచంలో మితవాద శక్తులు బలపడుతున్నాయని, అందుకు ఇటీవల అమెరికాలో జరిగిన ఎన్నికల్లో ట్రంప్ గెలుపు ఒక ఉదాహరణ అని అన్నారు. ప్రజలకు ప్రత్యామ్నాయం కనిపించనప్పుడు మితవాద శక్తులను ఆదరిస్తారని అన్నారు. ప్రపంచంలో ఆయుధాలు తయారు చేసే కార్పొరేట్ వ్యక్తుల ఊడిగం చేయడం తప్ప, ప్రజా అవసరాలు, ప్రజల ఆలోచనలు ట్రాంప్ లాంటి పాలకులకు అవసరం లేదన్నారు. భారతదేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఆర్ఎస్ఎస్ లాంటి మతోన్మాద శక్తులు అన్ని రంగాల్లోకి, ప్రభుత్వ వ్యవస్థల్లోకి చొరబడుతున్నాయని వివరించారు. ఒరిస్సా ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో ఈ మతోన్మాద శక్తులు చొరబాటు వేగవంతం అయిందని ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదం అని హెచ్చరించారు. ప్రధానంగా గిరిజన ప్రాంతాల్లోనూ, మత్స్యకారులున్న తీర ప్రాంతాల్లోనూ దేవుని విగ్రహాలు, పూజలు పేరుతో మహిళలను, శోభాయాత్రల పేరుతో యువతను మతోన్మాద శక్తులు ఆకర్షిస్తున్నాయని చెప్పారు. ప్రజా వ్యతిరేక విధానాలను కేంద్రంలో అమలు చేస్తున్న మోడీ ప్రభుత్వం మోచేతినీళ్లను గత వైఎస్ఆర్ ప్రభుత్వం, నేటి టిడిపి ప్రభుత్వం తాగుతున్నాయని విమర్శించారు. కార్పొరేట్ వ్యవస్థలకు సీఈఓ గా పనిచేసే చంద్రబాబు గురించి ప్రజలందరికీ తెలుసని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లోనే విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సిద్ధమవుతున్నాయని అన్నారు. ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించాలని పిలుపు నిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహణలో సిపిఎం చురుకైన పాత్ర పోషించిందని, జిల్లాలో వామపక్ష ఐక్య ఉద్యమానికి ఇక్కడినుండే శ్రీకారం చుట్టాలని అన్నారు. వామపక్ష పార్టీల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని కోరారు. సిపిఐఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి తమాడ సన్యాసిరావు మాట్లాడుతూ భారతదేశం జనాభాలను పేదరికంలోనూ అగ్రస్థానంలోకి వెళ్తున్నదని, ఇది భారతదేశ పరిస్థితిని హెచ్చరిస్తున్నదని అన్నారు. సిపిఎం పార్టీ జిల్లా మహాసభలు ఎర్రజెండా ఉనికిని వెలుగెత్తి చాటాలని ఆకాంక్షించారు. అంతకుముందు సీతారం ఏచూరి నగర్‌లో సిపిఎం పతాకాన్ని జిల్లా పార్టీ సీనియర్ నాయకులు విజికే మూర్తి ఆవిష్కరించారు. మహాసభల అనంతరం మృతి చెందిన సిపిఎం పార్టీ నాయకులు కార్యకర్తలకు నివాళులర్పిస్తూ మౌనం పాటించారు. ఇటీవల మృతి చెందిన సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, జిల్లా సీనియర్ నాయకులు బమ్మిడి శ్రీరాములు, కొల్లి సత్యనారాయణ చిత్రపటాలకి రాష్ట్ర సిపిఎం కార్యదర్శి వి శ్రీనివాసరావు, తులసి దాస్, జిల్లా కార్యదర్శి దుప్పల గోవింద్ లు పూలుమాల వేసిన నివాళులు అర్పించారు. మహాసభల్లో ప్రజా కళాకారులు ఆటపాటలు, తప్పు వాయిద్యాలు మహాసభల్లో నూతన ఉత్తేజాన్ని నింపాయి.

క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే రమణమూర్తి

విశాలాంధ్ర - నరసన్నపేట : స్థానిక మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలకు చెందిన క్రీడాకారులకు ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి అభినందించారు. ఇటీవల చిత్తూరు జిల్లాలో జరిగిన బాల్ బ్యాడ్మింటెన్ పోటీల్లో నరసన్నపేట మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలకు చెందిన విధ్యార్థులు విజయం సాధించారు. ఈ సంధర్భంగా గురుకుల పాఠశాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులతో పాటు విజేతలైన క్రీడాకారులు కత్తిరివానిపేటలో ఎమ్మెల్యే, రమణమూర్తిని కలవటం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, రమణమూర్తి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించి, ప్రతిభ కనబర్చిన విధ్యార్థులకు అభినందించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, రాయికన్నతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ : వజ్జ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్, వజ్జ బాబూరావు ఆదివారం ఎమ్మెల్యే, బగ్గు రమణ మూర్తిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సంధర్భంగా బాబూరావు ఎమ్మెల్యే, రమణమూర్తికి శాలువా కప్పి, సత్కరించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే, రమణమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య మంత్రి, చంద్రబాబునాయుడు ఇచ్చిన నామినేటెడ్ పదవులు బాధ్యతా యుతంగా నిర్వర్తించాలని, ప్రభుత్వాన్ని నమ్ముకున్న ప్రజలకు న్యాయం చేసేలా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఉన్నారు.

ముక్కలు ముక్కలుగా విరిగిపోతున్న అంగన్వాడి పౌష్టిక పాలు

విశాలాంధ్ర - టెక్కలి : అంగన్వాడి కేంద్రాలలో పౌష్టిక ఆహారం ఇస్తున్నామని గొప్పగా చెప్పుకుంటున్న ప్రభుత్వం... పిల్లలకు మాత్రం పాలు సక్రమంగా సరఫరా చేయలేకపోతుంది. గత మూడు నెలల నుండి టెక్కలి సెక్టర్ అంగన్వాడీ కేంద్రాలలో చిన్నపిల్లలకు, బాలింతలకు అందజేస్తున్న పౌష్టిక పాలుని వేడి చేస్తున్న క్రమంలో పూర్తిగా ముక్కలు ముక్కలుగా విరిగిపోయి దుర్వాసన వస్తూ..ఎందుకు పనికి రాకుండా దుర్వినియోగం అవుతున్నాయని స్థానికులు గుసగుసలాడు కుంటున్నారు. పేరుకే ప్రభుత్వం అంగన్వాడిలో పౌష్టిక ఆహారం దొరుకుతుందని చెపుతున్నారే తప్ప.. ఆహార పదార్థాలలో కల్తీ జరుగుతున్న విషయం ఏ ఒక్కరూ పట్టించుకోవటం లేదని స్థానిక కుటుంబాల వారు అంటున్నారు. ఈ మధ్య కాలంలో అంగన్వాడిలో ఇస్తున్న విజయ పాలు ప్యాకెట్లు ఏ ఒక్కరూ వినియోగించడం లేదని, అన్ని పాలు ప్యాకెట్లు బయటికి పారబోసేస్తున్నామని అంటున్నారు. ఓ వక్క అంగన్వాడి అధికారులు, వైద్యాధికారులు గర్భిణీలకు, బాలింతలకు, చిన్నపిల్లలకు పౌష్టిక ఆహారం తప్పనిసరిగా తీసుకోవాలని సూచిస్తున్నారు. కానీ అంగన్వాడి కేంద్రంలో ఇస్తున్న పౌష్టిక ఆహారాలలో పురుగులు నిండి ఉంటున్నాయని అలాంటి ఆహారాన్ని చిన్న పిల్లలు గర్భిణీలు తింటే వారి పరిస్థితి ఏం జరుగుతుందోనని స్థానిక కుటుంబీకులు భయాందోళన చెందుతున్నారు. ప్రభుత్వాధి కారులు పౌష్టిక ఆహార పదార్థాలు అంగ న్వాడిలకు సక్రమంగా చేరుతున్నాయో లేదోనని చూస్తున్నారే తప్ప... ఆ పౌష్టికఆహార పదార్థాలు నాణ్యత మాత్రం ఏ అధికారులు పరిశీలించటం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రభుత్వ పాలకులు దీనిపై స్పందించి అంగన్వాడి కేంద్రాలలో ఉన్న చిన్నారులకు, గర్భిణీలకు సరైన పౌష్టిక ఆహారాన్ని అందించే విధంగా చూస్తారని ప్రజలు కోరుకుంటున్నారు.

జ్యోతి హాస్పిటల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర - టెక్కలి : మండల కేంద్రంలో స్థానిక జ్యోతి హాస్పిటల్ ఆవరణంలో ఆదివారం బిగ్ టీవీ మరియు జ్యోతి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరంని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుండి ప్రారంభమైన మెగా వైద్య శిబిరానికి నియోజక వర్గంలో ఉన్న వివిధ గ్రామాలు నుండి అధిక సంఖ్యలో రోగులు తరలివచ్చి తమ ఆరోగ్య సమస్యలను పరిష్కరించుకున్నారు. అనంతరం డాక్టర్ ఎస్.విజయ్‌కుమార్ (ఎంబీబీఎస్ జనరల్ మెడిసిన్), ఎస్ రాజశేఖర్ (ఎంబీబీఎస్ డిసిహెచ్, డిఎన్బి పెడియాట్రిక్స్), డాక్టర్ స్రవంతి ఎంబీబీఎస్ గైనకాలజీ) వచ్చిన రోగులకు చికిత్సను అందించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి అనేక మంది పేదవాళ్లకు వైద్యం అందించడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఒకే హాస్పిటల్లో అన్ని చికిత్సలకు వైద్యం అందించే కోరిక ఈ విధంగా నెరవేరేందన్నారు. జ్యోతి హాస్పిటల్ లో ఆధునిక పరికరాలతో, అన్ని సౌకర్యాలతో వైద్యం అందిస్తుందని దీన్ని రోగులు వినియోగించుకోవాలని ఈ సందర్భంగా కోరారు. ప్రజలు సహకారం ఉంటే ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు మరెన్నో నిర్వహిస్తామని డాక్టర్ రాజశేఖర్ అన్నారు. ఈ కార్యక్రమంలో బిగ్ టీవీ స్టాఫర్ రాము, టెక్కలి రిపోర్టర్ రాజేష్, నేత్ర వైద్యులు డాక్టర్ రమేష్, జ్యోతి హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతో ప్రమాదకరంగా మారిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్

విశాలాంధ్ర - టెక్కలి : మేజర్ పంచాయతీలో అంబేద్కర్ జంక్షన్ నుండి తొలిసూరపల్లి రహదారిలో ఉన్న శ్రీశ్రీశ్రీ శ్యామసుందర స్వామి ఆలయ సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ మరియు కరెంటు స్తంభానికి పోదలు, పిచ్చి మొక్కలు అల్లుకొని ఎంత ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. ఆలయానికి వచ్చిన భక్తులు, అటువైపుగా వెళ్తున్న వాహనదారులు ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాన్స్ఫార్మర్ వద్ద అల్లుకొని ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని స్థానికులు కోరుకుంటున్నారు.

దేశం గర్వించే స్థాయికి క్రీడాకారులు ఎదగాలి : ఎమ్మెల్యే గొండు శంకర్



విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : భారతదేశం గర్వించే స్థాయికి జిల్లాకి చెందిన క్రీడాకారులు ఎదగాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆకాంక్షించారు. ఆ దిశగా లక్ష్యాలను నిర్దేశించుకుని క్రీడాకారులు క్రమ శిక్షణతో రాణించాలని ఆయన సూచించారు. శ్రీకాకుళం నగరంలోని టౌన్ హాల్ వేదికగా ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షులు తైక్వాండో శ్రీను అధ్యక్షత శ్రీకాకుళం జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో 38వ జిల్లా స్థాయి సబ్ జూనియర్ కూర్గీ, 13వ జిల్లా స్థాయి పూమ్ సే చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ పోటీల ప్రారంభోత్సవం శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో చదువుతో పాటు క్రీడలు అవసరమన్నారు. తైక్వాండో క్రీడకి జిల్లాలో ఆదరణ బాగా ఉందన్నారు. తైక్వాండో శ్రీను క్రీడాకారుల కోసం చేస్తున్న కృషి వల్లనే నేడు ఈ తైక్వాండో క్రీడ కోసం అందరికి తెలిసిందన్నాయు. చిన్న పిల్లలు కూడా ఈ క్రీడలో రాణించాలని ఉత్సాహాన్ని చూపి స్తుండడం అభినందనీయమన్నారు. క్రీడలలో గెలుపు ఓటములు సహజమన్నారు. క్రీడా స్ఫూర్తితో క్రీడాకారులు వాటిని తీసుకో వాలన్నారు. మెడల్స్ సాధించని వారు నిరాశకి గురికాకుండా మరింతగా ప్రాక్టీస్ చేసి ముందు ముందు జరిగే పోటీలలో విజేతలుగా నిలి చేందుకు కృషి చేయాలన్నారు. నిపుణులైన కోచ్‌లు ఇచ్చే సూచనలు పాటిస్తూ నిరంతరం సాధన చేయడం ద్వారానే జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో రాణించగలరన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్ళబోయే వారికి ఆయన ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపి తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షులు తైక్వాండో శ్రీను, సీనియర్ జర్నలిస్ట్ సుధీర్ వర్మ, బహుజన నేత డా.కంఠవేణు, తెలుగుదేశం పార్టీ శ్రీకాకుళం నియోజకవర్గ యువ నాయకుడు రెడ్డి శంకర్, న్యూట్రీషన్ కోచ్ నాగరాజు, శ్రీ ఫంక్షన్ హాల్ సహారా కృష్ణ, సంపతిరావు గోవిందరాజులు (నాయుడు) తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీలకి జిల్లా నలుమూలల నుంచి సబ్ జూనియర్స్ కేటగిరికి చెందిన క్రీడాకారులు విచ్చేశారు. ఈ పోటీలలో కోచ్‌లు తైక్వాండో గౌతమ్, తైక్వాండో నవీన్, జోగుపాటి వంశీ, వైశ్యరాజు జాస్మిన్, మదన్, బాలాజీ, గణ సాయి, రాహుల్, జనార్ధన్, హరి, నాగమ్మ పోటీలను విజయవంతంగా నిర్వహించారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వం నమోదు

విశాలాంధ్ర - మందస : రాష్ట్ర టీడీపీ పార్టీ పిలుపులో భాగంగా సభ్యత్వం నమోదు కార్యక్రమం చురుకుగా సాగుతోంది. శనివారం మండలం లోహరిబంద పంచాయతీ ధర్మపురం గ్రామంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు దాసరి తాతారావు, అందాల రామారావు, పిన్నింటి హరికృష్ణ, ధర్మాన దుర్యోధన, తాళ్ళ జోగారావు, పిన్నింటి కార్తీక్, నవీన్, ప్రశాంత్, ప్రవీణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సందడిగా నందెన్న సంబరాలు..

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : మండలం సీతాపురం గ్రామంలో ఆదివారం నందెన్న సంబరాలు సందడిగా జరిగాయి. ఈ సందర్బంగా యువకులు, చిన్నారులు వేసిన పగటి వేషాలు ఆకట్టుకున్నాయి. కాగా జాలారి, కోలాటం నృత్యాలు, పాములు వేషాలుతో పాటు అమ్మవారి, పౌరానిక వేషాలు అలరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు పరిసర ప్రాంతాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్ ప్రమాదంలో రైస్ మిల్లు వ్యాపారి

విశాలాంధ్ర - మందస : మండలం రాధకృష్ణాపురం కూడలి వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రైస్ మిల్లు వ్యాపారి మృతి చెందారు. మందస కరణం వీధికి చెందిన రైస్ మిల్లు వ్యాపారి వడ్డీ సంతోష్ కుమార్ (30) ద్విచక్ర వాహనంపై వస్తుండగా రాధాక్రిష్ణపురం కూడలి వద్ద ఎదురుగా వస్తున్న ఆటో పరస్పరం ఢీ కొనడంతో వడ్డీ సంతోష్ కుమార్ కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సంతోష్ ను చికిత్స కై 108లో పలాస ఆసుపత్రికి తరలిస్తుండగా పరిస్తితి విషమించడంతో మృతి చెందాడు. ఈ సంఘటనతో మందస గ్రామంలో విషాద ఛాయలు చోటు చేసుకొంది.

క్రికెట్ క్రీడాకారుడు జున్నారావుకు సన్మానం

విశాలాంధ్ర - పలాస : మండలం అల్లుకోల గ్రామా నికి చెందిన విద్యార్థి, అండర్ 19కు ఎంపికైన రాజాన జున్నారావును ఆదివారం టీడీపీ కార్యాలయంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రికెట్ క్రీడలో జున్నారావు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. తన అద్భుతమైన పేస్ ఫాలింగ్‌తో వెలుగులోకి వచ్చిన జున్నారావు ఈ ప్రాంతానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పి.విఠల్ తో పాటు అల్లుకోల గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీరాంపురంలో సీసీ రోడ్డు నిర్మాణం

విశాలాంధ్ర - కంచిలి : కంచిలి మండలం పెద్ద శ్రీరాంపురం గ్రామంలో శివాలయం ఉంచి సిందుపోలమ్మ గుడి వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణం ఆదివారం చేపట్టారు. జాతీయ ఉపాధి హామీ పథకం విధులతో జరిగిన ఈ రహదారి పనులను సీనియర్ టీడీపీ నాయకుడు మాదిన రామారావు, కిరణ్, హరిబాబు, మాదిన ప్రదీప్, భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర గ్రంధాలయ ఛైర్మన్‌గా నియమించబడిన కోటేశ్వరరావుకి అభినందనలు : సక్షం మరియు దివ్యాంగ సంఘం



విశాలాంధ్ర : ఎల్ఎన్‌పేట : ఆంధ్రప్రదేశ్ గ్రంధాలయం సంస్థ ఛైర్మన్‌గా దివ్యాంగ సంఘం నాయకుడుగాను, మార్గదర్శిగా పని చేసిన గొనుగోంట్ల కోటేశ్వరరావు నియమించ బడిన వలన సక్షం మరియు దివ్యాంగ సంఘం నాయుకులు హర్షం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా దివ్యాంగ సంఘం నాయుకులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు ఉప ముఖ్య మంత్రి పవణ్ కళ్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, కోటేశ్వరరావుకి అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంనందు లయన్‌డా॥ఎం.కె మిశ్రో, ఎ.రమా, గణపతి, శైలజ, శంకరరావు, భాస్కరరావు, ముకుందరావు, సాయి, జి.రమణమూర్తి, శ్రీను, ఉషారాణి,వాసవి, దేవికా, ప్రసాద్, అప్పలస్వామి, అప్పలనాయుడు, నారాయణరావు, జనార్ధనరావు, అప్పన్న, చిన్నారావు, తదితరలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

విశాలాంధ్ర - కవిటి : మండలంలోని రాజపురం బాలురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2004 సంవత్సరంలో 6 నుండి 10వ తరగతి చదువు కున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థులు, ఉపా ధ్యాయులు పాఠశాల వద్ద సమావేశమై ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. గత స్మృతులను నెమరు వేసుకుంటూ ఆనందంగా గడిపారు. అలాగే విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యా యులను పుష్పగుచ్ఛం అందజేసి సాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వపు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి

మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం : గ్రామాల్లో ఎన్ఈఆర్ఇజిఎస్ పరిధిలో చేపడుతున్న రోడ్లు, డ్రైనేజీల పండ్లను త్వరితగతిన పూర్తి చేయాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అంబటి నిర్మలాదేవి అధ్యక్షతన ఆదివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ఇచ్చిన తీర్మానాల మేరకు ప్రాధాన్యత క్రమంలో పనులు చేపడుతున్నామని వివరించారు. గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు ఐక్యతగా ఉంటూ అభివృద్ధి పనులను సకాలంలో చేసుకోవాలని సూచించారు. ఇది గొప్ప అవకాశం అని గ్రామాలను అభివృద్ధి చేయడం మన అందరి బాధ్యత అని చెప్పారు. ఒక్కో ప్రభుత్వం ఒక్కో తరహాలో అభివృద్ధి పనులు చేపడతాయని ప్రభుత్వాలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ తమ గ్రామం అభివృద్ధి ఆకాంక్షగా ముందుకు సాగాలని చెప్పారు. ఎన్ఆర్ఈజీఎస్ పరిధిలో చేపడుతున్న పనులను పెండింగ్ ఉంచకుండా పూర్తి చేయాలని, ఎంత మేర పనులు చేశారో ఎంత మేర బిల్లులు పెండింగ్ ఉన్నాయో వివరిస్తే వాటిని చెల్లించేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. రైతులకు సంబంధించిన దాన్యం బిల్లులను సతశాతం అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో పెద్దపులి సంచారం

విశాలాంధ్ర - పలాస : ఆంధ్రా-ఒడిశా సరిహద్దు సమీప ప్రాంతాల్లో పెద్దపులి సంచరిస్తున్న సమాచారం అందుకున్న కాశీబుగ్గ రేంజ్ అటవీశాఖ అధికారి ఏ.మురళీకృష్ణమ నాయుడు సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఒడిశా సరిహద్దు గంజాం జిల్లా జయంతిపురం గ్రామంలో పెద్దపులి దాడిలో గాయ పడిన యువకుడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆంధ్రా సరిహద్దు వైపు పెద్దపులి పయనమైనట్లు సమాచారం అందుకున్న కాశీబుగ్గ అడవి శాఖ అధికారులు అప్రమత్త మయ్యారు. పెద్దపులి సంచరిస్తుందన్న సమాచారంతో ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతల్లో ఉన్న ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఆదివారం కాశీబుగ్గ రేంజ్ అటవీశాఖ అధికారి ఏ.మురళీకృష్ణమ నాయుడు సిబ్బందితో కలిసి ఇచ్ఛాపురం రూరల్ ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.

ప్రజామోదం మేరకే మాస్టర్ ప్లాన్

- అభ్యంతరాలు పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందిస్తాం
- ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ చర్చ వేదికలో ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం : ప్రజా ఆమోదం మేరకే మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ చర్చా వేదిక ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్‌ను గతంలోని రూపొందించారని తెలిపారు. తాను ఎమ్మెల్యే అయిన వెంటనే మాస్టర్ ప్లాన్‌ను పూర్తి స్థాయిలో రూపొందించేందుకు ప్రభుత్వానికి మరి కొంత సమయం కోరడం జరిగిందని చెప్పారు. అటు తర్వాత ప్రజల నుండి వినతుల స్వీకరించి ఆ సూచనలు, సలహాలను పొందుపరిచి మాస్టర్ ప్లాన్ ను ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందన్నారు. ఇంకా ఆలస్యం చేస్తే అమృత్ పథకం ద్వారా రావలసిన నిధులు వెనక్కి వెళ్లిపోతాయని చెప్పారు. మాస్టర్ ప్లాన్ అమల్లోకి వస్తే నియోజకవర్గ రేఖలే మారిపోతాయని పేర్కొన్నారు. ఇంజనీర్లకు, ప్రజలకు, నిర్మాణ దారులకు ఇబ్బందులు లేకుండా త్వరలోనే సర్కులేషన్ ప్యాట్రన్ కూడా అమలులోకి వస్తుం దన్నారు. ఇది అమలులోకి వస్తే ఇంజనీర్లకు, ప్రజలకు ఎంతో సులభతరంగా ఉంటుందన్నారు. కొన్ని ప్రాంతాల్లో రెసిడెన్షియల్ ప్లాన్లు మాత్రమే ఇచ్చేందుకు అధికారాలు ఉన్నాయని దీంతో వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ పరిస్థితులను పరిష్కరించేందుకు మిశ్రమ ప్లాన్లను అందించేందుకు ఇప్పటికే చర్చించమని చెప్పారు. మాస్టర్ ప్లాన్ కు సంబంధించి ప్రజల నుంచి 155 అభ్యంతరాలు అందాయని, వీలైనంత త్వరగా వీటిని పరిశీలించి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాల్సిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ప్రసాద్, ఎంఈ, టిపిఓ ఉమామహేశ్వరరావు, ఇతర మున్సిపల్ అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఇంజనీర్లు, ఎల్టీపీలు పాల్గొన్నారు.

వికలాంగురాలికి బ్యాటరీ సైకిల్ వితరణ

విశాలాంధ్ర - నరసన్నపేట/పోలాకి : మండలంలోని యాట్ల బసివలస గ్రామంలో వికలాంగు రాలైన డొంకాన బోడమ్మకు ఆదివారం పంచాయితీ సర్పంచ్, మెండ శ్రీనివాసరావు తన తల్లి, మెండ ఆదిలక్ష్మి చేతుల మీదుగా ఎలక్ట్రికల్ మోటార్ బ్యాటరీ సైకిల్ వితరణ చేశారు. ఈ సంధర్భంగా వికలాంగుల సంక్షేమ సమితి ప్రతినిధి, బి.రాంబాబు మాట్లాడుతూ జడూరు గ్రామానికి చెందిన బొడమ్మకు సర్పంచ్, శ్రీనివాసరావు బ్యాటరీ సైకిల్‌ను అందించినందుకు అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడే మండల స్థాయి పాఠశాల ప్రతిభా పాటవ పోటీలు

విశాలాంధ్ర - పొందూరు : స్థానిక యంగ్ స్టార్స్ యూత్ క్లబ్ సౌజన్యంతో బాలల దినోత్సవ సందర్భంగా మండల స్థాయి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు నాలుగు, ఐదు, తరగతుల వారు నలుగురు పిల్లలు ఒక గ్రూపుగా మాత్రమే పంపాలని యంగ్ స్టార్స్ యూత్ క్లబ్ సాహితీ కార్యదర్శి గిరిజాల భాస్కరరావు, క్లబ్ గౌరవాధ్యక్షులు భాసా ఆనందమోహన్, అధ్యక్షులు కాళ్లకూరి శాంతారాంలు వెల్లడించారు. నేటి ఉదయం పొందూరు దివ్య జ్ఞాన సమాజంలో ఉదయం 9:30 నుండి 10:30 వరకు ప్రతిభ పాటవ పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం యూత్ క్లబ్ రూరల్ స్పోర్ట్స్ క్లబ్ సౌజన్యంతో విజేతలకు బాలల దినోత్సవం కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామన్నారు.

అంతరాష్ట్ర బైక్ దొంగల అరెస్టు

మొత్తం 5 ద్విచక్ర వాహనాలు రికవరీ

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : ఒడిశా ఆంధ్రా ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడిన ఇద్దర్ని పట్టణ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఒరిస్సా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన కిరణ్ కుమార్ జన (లిట్టు) ఆంధ్రాలోకి వచ్చినట్లు పోలీసులకు అందిన సమాచారంతో ఆదివారం మధ్యాహ్నం సుమారు 3.30 గంటల సమయంలో అతన్ని స్కై డ్రాప్ జంక్షన్ వద్ద పట్టణ ఎస్సై ఈ.చిన్నం నాయుడు తన సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నారు. నిందితున్ని విచారించి దొంగతనం కేసుల్లో రిజిస్ట్ కాబడిన నాలుగు మోటార్ సైకిళ్ళను అతడి నుండి స్వాధీనం చేసుకున్నారు. కంచిలిలో ఢిల్లీ రావు వద్ద ఉంచిన ఒక బైక్‌తో పాటు మొత్తం ఐదు మోటార్ సైకిళ్ళను స్వాదీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్సై తెలిపారు. వాటిల్లో పట్టణ పోలీస్ స్టేషన్‌కు సంబంధించి రెండు మోటార్ సైకిళ్ళు, బరంపురం టౌన్‌కి సంబంధించి మూడు మోటార్ సైకిళ్ళు ఉన్నాయని, నిదింతులను రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు.

సత్య సాయి అఖండ భజన

విశాలాంధ్ర - పోలాకి : భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి 99 వ జయంతి ఉత్సవాలు లో భాగంగా ఆదివారం పోలాకి ప్రశాంతి సత్యసాయి మందిర్ లో గ్లోబల్ అఖండ భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి భజన మండలి కన్వీనర్ బరాటం రామారావు మాట్లాడుతూ 19. 11. 2024 మంగళవారం నుండి 23. 11. 2024 శనివారం వరకు ఐదు రోజులు పాటు. ఓంకారం సుప్రభాతం నగర సంకీర్తన గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం కార్యక్రమం వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ , మెగా వైద్య శిబిరం మెడికల్ క్యాంప్ బ్లడ్ డొనేషన్ 400 మంది వృద్ధులకు వస్త్ర దానం , వంద రకాల పిండివంటలతో స్వామికి మహా నివేదన 4000 మందికి నారాయణ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యూత్ కో కన్వీనర్ తూలుగు సాయి లుకలాపు చలపతిరావు పోలాకి గ్రామ కమిటీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల శానిటరీ వర్కర్లకు... బకాయి పడ్డా జీతాలు ఇవ్వండి

ఏఐటీయూసీ డిమాండ్

విశాలాంధ్ర - పొందూరు : పాఠశాలల్లో శానిటరీ వర్కర్స్ గా పని చేస్తున్న కార్మికులకు నాలుగు నెలలగా బకాయి పడ్డా జీతాలను అందించి ఆదుకోవాలని రాష్ట్ర మెసెంజర్స్ యూనియన్ అధ్యక్షులు ఎమ్మార్సీ సిబ్బంది పోతయ్య, జిల్లా ఏఐటియుసి ఉపాధ్యక్షులు రాంబిల్లి సత్యనారాయణలు అన్నారు. మండల ఎంఆర్సి కేంద్రంలో ఆదివారం జరిగిన మండల పాఠశాల శానిటరీ వర్కర్స్ యూనియన్ సమావేశంలో పాల్గొని పై విధంగా అన్నారు. పొట్టకూటి కోసం తక్కువ జీతానికి శానిటరీ వర్కర్లగా పనిచేస్తున్న కార్మికుల నెల వేతనము అందించడంలో సర్కారు నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. నాలుగేళ్లగా జీతాలు లేక వస్తుల్లో ఉన్న శానిటరీ వర్కర్లకు సకాలంలో జీతాలు ఇచ్చి ఆదుకోవాలని అన్నారు. పాఠశాలలకు సానిటరీ పరికరాలు అందివ్వాలన్నారు. కార్మికులకు ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మా,సరస్వతి, పార్వతి, సూరమ్మ తదితర మండల స్కూల్ సానిటరీ వర్కర్స్ పాల్గొన్నారు.

అన్ని సదుపాయాలు కల్పిస్తేనే 'మెగా'లో విలీనం

ఉద్దానం కార్మికుల డిమాండ్

విశాలాంధ్ర - సోంపేట : పలాస నుంచి ఇచ్ఛాపురం వరకు 5 మండలాలు, మున్సిపాలిటీల్లో పని చేస్తున్న ఉద్దానం మంచి నీటి ప్రాజెక్టు కార్మికులు కొత్తగా ఏర్పాటు చేసిన మెగా వాటర్ స్కీంలో విలీనం అయ్యేందుకు అన్ని సౌకర్యాలు కల్పించాల్సి ఉందని కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సోంపేట మండలం తురకశాసనాం ఉద్దానం హెడ్ వర్క్స్ వద్ద అన్ని మండలాల ఉద్దానం ఆపరేటర్లు సమావేశమై పలు అంశాలను చర్చించారు. ఏళ్ల తరబడి ఉద్దానం మంచినీటి పథకంలో కార్మికులుగా పని చేస్తున్న తమకు ప్రభుత్వాలు కార్మిక చట్టాలకు అను గుణంగా సదుపాయాలు కల్పించకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఈపీఎఫ్, ఇన్సురెన్స్, జీఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. అనేకమార్లు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి ఈ సమస్యపై విన్నవించినప్పటికి ఎటువంటి స్పందన లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. ఇంజనీరింగ్ అధికారులు సైతం మెగా సంస్థలో చేరుపోవాలని సూచాయగా చెప్పడం తప్పా సరైన పద్ధతిలో విలీనానికి అనుగుణమైన పరిస్థితులు కల్పించడం లేదని పేర్కొన్నారు. ఈ విషయమై ఇటీవల రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కలిసి సమస్యను విన్నవించడం జరిగిందని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను కూడా కలవడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కొర్నాన నీలకంఠం, బంజు జోగారావు, జి.శ్రీనివాసరావు, అప్పలరాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కొనసాగుతున్న మహాయజ్ఞం

విశాలాంధ్ర - సోంపేట : సోంపేట మండలం అనంతపురం గ్రామంలో శ్రీవేదగాయత్రి 7వ మహాయజ్ఞం వైభవంగా కొనసాగుతుంది. 4వ రోజైన ఆదివారం భక్తుల తాకిడితో కిటకిట లాడింది. చుట్టుప్రక్కల గ్రామాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజ రయ్యారు. ముందుగా నమోదు చేసుకున్న భక్తులు యజ్ఞ హోమంలో పాల్గొని అగ్ని దేవునికి యజ్ఞ సామాగ్రిని సమర్పించుకున్నారు. యజ్ఞ నిర్వాహకులు, ఆర్య సమాజ ప్రముఖులు యజ్ఞాన్ని భక్తులతో ఘనంగా కొనసాగించారు. హాజరైన వేలాది మంది భక్తులకు భారీస్థాయిలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా గ్రామంలో అన్ని ఏర్పాట్లు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ పెద్దలు మామిడి గురుమూర్తి, బూర్లె ధర్మారావు, సర్పంచ్ ప్రతినిధి బూర్లె లింగరాజు, మామిడి దేవరాజు, గంగిట్ల ఢిల్లీరావు, తదితరులతో పాటు కమిటీ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

నేడు కేంద్రమంత్రి సందర్శన

అనంతపురంలో జరుగుతున్న మహాయజ్ఞంలో పాల్గొనేందుకు కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు సోమవారం ఉదయం 10 గంటలకు హాజరు కానున్నట్లు యజ్ఞ నిర్వహణ కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా ఇటు ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాలకు చెందిన కూటమి పార్టీ నేతలు, అభిమానులు, భక్తులు హాజరు కావాలని కోరారు.

ముమ్మరంగా పశుగణన సర్వే

విశాలాంధ్ర - పొందూరు : మండలంలో ముమ్మారంగా పశుగణన సర్వే నిర్వహిస్తున్నారు. లైదాము, కొంచాడ, రాపాక, కొల్లి పీట గ్రామంలో గ్రామీణ పశు వైద్య కేంద్ర జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ పి.బంగారు తల్లి ఆధ్వర్యంలో ఇంటింటా పర్యటన చేసి పశు వుల వివరాలను నమోదు చేస్తున్నారు. పశు ఆరోగ్య పరిస్థితులు పై ఆరా తీస్తున్నారు. పశు వ్యాధుల పట్ల యజమానులు అప్రమత్తం కావాలని కోరారు. పారుడు వ్యాధి, జ్వార లక్ష్యనాలు ఉంటే వెంటనే తెల పాలని కోరారు. ఇంటింటా సర్వేను పూర్తిచేసి పశువుల వివరాలను నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏహెచ్ఏ గాదు స్వాతి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంకరాన్ని విజయవంతం చేయండి

విశాలాంధ్ర - జలుమూరు : జనవరి 5వ తేదీన విజయవాడ లో జరిగే హైందవ శంఖారాణి విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు లోకనాథం ఆనందరావు ఆర్‌ఎస్ఎస్ జిల్లా కార్యవాహ మాధవ పాత్ర పలువురు పిలుపునిచ్చారు. ఆదివారం మధ్యాహ్నం జలుమూరు మండలం చల్లవానిపేట పద్మావతి కళ్యాణ మండపంలో జరిగిన జలుమూరు, సారవకోట, కోటబొమ్మాళి మండలాల 5వ శంఖారామ కార్యక్రమానికి పాల్గొని మాట్లాడారు సారవకోట కండ కార్యవర్గ ఉమేష్ మూడు రెవెన్యూ మండలాల నుండి హిందూ ధర్మా అభిమానులు పాల్గొన్నారు. దేవాలయాల ఆస్తులు దేవాలయాలకు అప్పచెప్పాలని ట్రస్ట్ బోర్డులో రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా హిందూ దైవ భక్తులకు మాత్రమే నియమించాలని మీరు కోరారు. పై మూడు మండలాల నుండి వందలాది మంది హైందవ అభిమానులు హాజరయ్యారు.

హిందూ సాంప్రదాయం ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

విశాలాంధ్ర - టెక్కలి : మండలం జయకృష్ణాపురం గ్రామంలో విశ్వహిందు పరిషత్ టెక్కలి మండలశాఖ ఆధ్వర్యంలో బమ్మిడి శేషగిరి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. గ్రామంలో నగర సంకీర్తనతో, భగవత్ గీత పారాయణంతో ప్రారంభం చేసి హిందూ సాంప్రదాయం వాటి ప్రాధాన్యత మరియు ప్రాముఖ్యత,గూర్చి ఆహ్వానితులు వివ రించారు. ఈ సత్సంగ సమావేశంలో ముఖ్యులు తమ్మినేని ఆనందరవు యోగ గురువు విశ్వహిందు పరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు గేదెల చంద్రశేఖర్, నరసింహస్వామీ, ప్రముఖ ప్రవచన కర్త రామకృష్ణ కరుణ రమణ సనపల కరుణ్ కుమార్, బమ్మిడి సోమేశ్వరరావు, సత్తారు పాపారావు, రోనంకి కృష్ణ కుమారి, సత్తారు మల్లేశ్వరారావు కణితి మల్లేశ్వరరావు, బెండి మురళి, దవల మహేష్, దవల మల్లేశ్వరారావు సత్తారు గౌరీపతి, బమ్మిడి లక్ష్మణరావు, కణితి పాపారావు, కొప్పల ఉత్తరుడు, కొప్పల ప్రసాద్ పీసీని గౌరీ, మరియు భక్తులు గ్రామస్థులు పాల్గొన్నారు.

బాలియాత్రకు కళింగసీమ ప్రజలు తరలిరండి



విశాలాంధ్ర - పలాస : కళింగ సీమ పూర్వ రాజధాని శ్రీముఖలింగంలో ఈనెల 17న 2 గంటల నుండి 6 గంటల వరకు నిర్వహించే ప్రాచీన సాంప్రదాయమైన బాలి యాత్రలో ప్రజలు విశేషంగా పాల్గొని జయప్రదం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

బాలి యాత్ర అంటే ఏమిటి..?

ప్రపంచానికి సముద్రయానం తెలియని రోజుల్లో ఐదు వేల సంవత్సరాల పూర్వం ఈ ప్రాంత పూర్వీకులైన కళింగ సీమ ప్రజలు తమ నౌకలపై సరుకులతో తూర్పు ఆగ్నేయ దేశాలైన ఇండోనేసియా,మలేసియా,జావా,సుమిత్ర, సింగపూర్, శ్రీలంక, చైనా తదితర దేశాలకు వ్యాపారాల కోసం ఇండోనేషియాలోని బాలి ద్వీపానికి బయలుదేరేవారు. అలా బయలు దేరిన కళింగ సీమ ప్రాంత ప్రజలు క్షేమంగా వెళ్లి లాభాలతో తిరిగి రావాలని ఆకాంక్షిస్తూ మహిళలు కార్తీక పౌర్ణమి తదుపరి మూడు రోజులు శ్రీముఖలింగం పుణ్య క్షేత్రంలోని వంశధార నదీ తీరంలో అరటి దొప్పలపై దీపాలు వదిలి దీపోత్సవం చేసేవారు.

బాలి యాత్ర ఎందుకు పునః ప్రారంభించాలి

ఒక ముని శాపం వలన కళింగసీమ ప్రజలు తమ పూర్వీకుల సాంప్రదాయమైన బాలి యాత్ర చేయడం మరిచి తమ పితృ దేవతల అనుగ్రహాన్ని కోల్పోయి తమ రాజ్యాన్ని పోగొట్టుకొని, విభజించబడి (ఒడిస్సా, ఉత్తరాంధ్ర) పాలకుల చేతిలో నిరాదరణకు గురై, తమకు అందుబాటులో ఉన్న నీటిని కూడా వాడుకోలేక (ఒడిశా, ఆంధ్ర అంతర్ రాష్ట్ర నదీ జలాల వివాదాలు) అభివృద్ధికి దూరంగా,పాలితులుగా ఉండి పోతారని, తమ భూములు, ఖనిజాలు, కొండలు ,వనరులు అన్యాక్రాంతమై వలన కూలీలుగా మారి దేశాలు పట్టుకు తిరుతారని, చైనా యాత్రికుడు "హుయాన్ త్సాంగ్" ఒక గ్రంథంలో రాశాడు.

చాల కాలం క్రితం వరకు శ్రీముఖలింగంలో వంశధార నదీ తీరంలో కార్తీక పౌర్ణమి తరువాత మూడు రోజులపాటు బాలియాత్ర జరిగేది. తరువాత ఆ సంప్రదాయం ఆగిపోయింది. శాప విమోచనం జరిగి, మనం కోల్పోయిన వైభవాన్ని తిరిగి పొందడానికి నాటి ప్రాచీన కళింగ సీమ సాంప్రదాయమైన బాలి యాత్రను పునః ప్రారంభించాలి. ప్రస్తుతం ఒడిశా ప్రభుత్వం కటక్ లో మహానది తీరంలో బాలి యాత్రను అధికారిక "బాలి జాతర"గా కార్తీక పౌర్ణమి నుండి వారం రోజుల పాటు నిర్వహిస్తోంది. ఈ సంవత్సరం 15 నుంచి 22 వరకు ఒరిస్సా రాష్ట్ర ప్రభుత్వం బాలి జాతరను అధికారిక కార్యక్రమంలో నిర్వహిస్తుంది. భవిష్యత్తులో మన రాష్ట్ర ప్రభుత్వమే ఈ బాలి యాత్రను శ్రీముఖలింగం లో అధికారికంగా నిర్వహించేలా కార్యాచరణ చేయాలి.

బాలి యాత్రలో ఎందుకు పాల్గొవాలి..?

బాలి యాత్ర ఒక సాహస యాత్ర. ఈ నౌకాయానంలో తుఫానుల వలన, సముద్ర జీవుల దాడుల వలన, అనారోగ్యం వలన ఎంతో మంది చనిపోయేవారు. వారి సాహసం మన కళింగసీమకు భారత దేశంలోనే కాక ప్రపంచంలోనే పేరు ప్రఖ్యాతులు తెచ్చి పెట్టాయి. ఐదు వేల సంవత్సరాలుగా సముద్ర యానంలో చనిపోయిన ప్రాంత పూర్వీకుల ఆత్మ శాంతికి ఘనంగా నివాళులు అర్పించడం ద్వారా వారి ఆశీస్సులు పొంది, మన ప్రాంతంలోని అన్ని కుటుంబాలు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వ రాయ్యాలతో అభివృద్ధి చెందుతారు. ఈ కార్యక్రమంలో మన ప్రాంతంలోని అన్ని కుటుంబాలు పాల్గొనాలని, ముఖ్యంగా ఆడపడుచులు మెట్టినింట సౌభాగ్యం, వారి కన్నవారు మరియు తోబుట్టువులు ఐశ్వర్యాలతో, సుఖ శాంతులతో తులతూగాలంటే ఈ దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొనాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. అరటి తెప్పల్లో దీపాలు వదలాలని, ఆ రోజు శ్రీముఖలింగం రాలేని వారు అందుబాటులో ఉన్న నదుల్లో, చెరువుల్లో అరటి దొప్పలో దీపాలు వదలాలని, 2 సంవత్సరాలు అలా చేసి 3వ సంవత్సరం శ్రీముఖలింగం వచ్చి ముఖలింగేశ్వరుని దర్శనం చేసుకుని 3 సం. బాలి యాత్రలో పాల్గొని తమ పూర్వీకుల ఆత్మశాంతికి తోబుట్టువుల సుఖశాంతులకు కారణభూతులై ఈ ప్రాంత పూర్వవైభవానికి పునాదులు వేయాలని కోరారు. ప్రాచీన కళింగసీమ సాంప్రదాయమైన ఈ బాలియాత్రలో ఈ ప్రాంత ప్రజలంతా విశేషంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కళింగ అనే పేరుతో దేశం ప్రాచీన కాలం నుండీ ఉండడం నిజం. ఇది గోదావరికి ఉత్తరాన మహానదికి దక్షిణాన వుండేది. ఆది నుండీ కళింగ ప్రజలు సైన్యంలో తాత్కాలిక సైనికులుగా పనిచేసే వారు. గజపతుల కాలం లో కూడా తాత్కాలిక సైనికుడుగా పనిచేస్తూ వ్యవసాయం చేసేవారు. కపిలేంద్ర గజపతి (1440 -70) కాలంలో సరళా దాస్ అనే సైనికుడుగా రైతుగా వుంటూ ఒరియా లో మహాభారతం రాసాడు. ఒరియా భాషకి అతనే ఆదికవి. అతను "నాకు సంస్కృతం రాదు " అని చెప్పుకొంటాడు. చక్కని జానపద సరళ ఒరియాలో భారతం రాస్తాడు. అతను కళింగుడు అయివుండవొచ్చు. ఈనాటికీ అనేక మంది కాళింగులు ఆర్మీ లో చేరుతుంటారు.

ప్రతాపరుద్ర గజపతికి కృష్ణదేవరాయలకు (1518) మధ్య జరిగిన యుద్ధము, ఆపైన వైవాహిక సంబంధములో జరిగిన సంధి ఒప్పందంలో రాయలు కృష్ణా నదికి ఉత్తరాన వున్న భూభాగాన్ని కళింగ గజపతికి ఇచ్చివేయదానికి అంగీకరించాడు. ప్రతాపరుద్ర దేవ్ తన కూతురు జగన్మోహిని/అన్నపూర్ణ ని కృష్ణదేవరాయలకు ఇచ్చి పెళ్లిచేస్తారు.

(ప్రసాదరావు ఆంధ్ర ప్రదేశ్ సమగ్ర చరిత్ర)

బాలి ఇండోనేసియా దేశం దరిన చిన్న దీవి. కళింగసీమలో నాడు బాలి యాత్ర సాంప్రదాయాన్ని నాటి కళింగ సీమ ప్రజలు సముద్ర తీరాన, నది తీరాన దీపోత్సవం ఆచరించేవారు. అది నేటికీ కటక్ లో కొనసాగుతున్నది. కటక్ లో ఒరిస్సా రాష్ట్ర ప్రభుత్వం ఈ బాలి జాతర పేరిట ఈనెల 15 నుండి 22 వరకు ఎనిమిది రోజులు పాటు ఒడిస్సా ప్రభుత్వం అధికారిక కార్యక్రమంల నిర్వహిస్తున్నది.

వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు చోరీ గ్యాంగ్ అరెస్టు

జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : శ్రీకాకుళం జిల్లా శ్రీకాకుళం సబ్ డివిజన్ జె ఆర్ పురం సర్కిల్ పరిధిలో జె ఆర్ పురం పోలీస్ స్టేషన్లో నమోదు కాబడిన కేసు దర్యాప్తులో భాగంగా పట్టుబడిన నింది తులను విచారించగా శ్రీకాకుళం జిల్లాలో జె ఆర్ పురం పోలీస్ స్టేషన్ తో పాటు ఎచ్చెర్ల, లావేరు, జి.సిగడం, పొందూరు పోలీస్ స్టేషన్లో సుమారుగా 33 కేసులలో 53 ట్రాన్స్ఫార్మర్లు దొంగతనం చేసిన నిందితులను అరెస్ట్ చేసి కేసు ప్రాపర్టీ 636 కేజీల కాపర్ వైరు, దిమ్మలు, 5 కేజీల అల్యూమినియం వైరును పూర్తిస్థాయిలో రికవరీ చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పత్రిక సమావేశంలో కేసు పూర్వపరాలు వెల్లడించారు. ఈనెల 1వ తేదీ రాత్రి ఎవరో గుర్తు తెలియని చోరులు రణస్థలం మండలం మహంతి పాలెం గ్రామంలో గల కెళ్ళ వెంకట రమణ గారి వ్యవసాయం పొలంలో వున్నా 3 ఫేజ్ 16 ట్రాన్స్ ఫార్మర్ ని పగలగొట్టి, అందులో వున్నా సుమారు 12 కేజీ లు గల రాగి వైరును దొంగిలించుకొని పోయినట్లు ఫిర్యాదు నమోదు అయిందన్నారు. శ్రీకాకుళం జిల్లాలో 33 నేరములలో 53 ట్రాన్స్ఫోర్మ్ లో రికవరీ అయిన సొత్తు రాగి వైరు 350 కేజీలు, రాగి దిమ్మలు 286 కేజీలు, అలుమినియం వైరు 5 కేజిలు రికవరీ అయినట్లు తెలిపారు. అలాగే ఆదివారం రణస్థలం మండలం, బీరు ఫ్యాక్టరీ ఎదురు గా గల పాడు బడిన భవనం వెనకాల ఏడుగురు ముద్దాయిలను అరెస్టు చేయడం జరిగిందన్నారు. పై కేసులలో అరెస్టు కాబడిన వారు చెడు వ్యసనాలకు బానిసై జల్సాగా బ్రతకాలనీ ఉద్దేశం తో చెడు మార్గములో డబ్బులు సంపాదించి వాటితో వాళ్ళ అవసరాలను తీర్చుకోవాలని దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. కేసులలో డీఎస్పీ సీహెచ్. వివేకానంద పర్యవేక్షణలో సాంకేతికతను వినియోగించు కొని చాకచక్యంగా కేసులు ఛేదించినట్లు తెలిపారు. ఎస్పీ అభినందించిన వారిలో ఎం.అవతారం, సిఐ. జే.ఆర్.పురం సర్కిల్,.ఎస్. చిరంజీవి, ఎస్ఐ జె.ఆర్.పురం పి.ఎస్.జి.లక్ష్మణరావు ఎస్ఐ లావేరు పి.ఎస్.వై.మధు సూధనరావు, ఎస్ఐఐ జి సిగడాం పి.ఎస్. కె.కిరణ్ కుమార్ సింగ్, హెచ్ సి జే. ఆర్.పురం పి.ఎస్., కే. లక్ష్మణరావు,కానిస్టేబుల్ లావేరు పి.ఎస్.,ఎం జోగా రావు, కానిస్టేబుల్ జే.ఆర్.పురం పి.ఎస్.,డి .తవిటి నాయుడు,కానిస్టేబుల్ జే. ఆర్. పురం పి.ఎస్.కె. సూర్యారావు కానిస్టేబుల్ జే.ఆర్.పురం పి.ఎస్..సి హెచ్. సురేష్ కానిస్టేబుల్ జే.ఆర్. పురం పి. ఎస్. తదితరులు ఉన్నారు.

ఆలయ స్థలాన్ని పరిరక్షించండి : ఎమ్మెల్యేకి వినతి పత్రం అందించిన శివాలయ కమిటీ

విశాలాంధ్ర - రణస్థలం : మండలంలోని బంటుపల్లి రెవెన్యూ పరిధిలో వెలసిన ఎండల మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధి నిమిత్తం భూమిని గ్రామ పెద్దలు కేటాయించారు. అయితే ఆ భూమిని బంటుపల్లి గ్రామానికి చెందిన తొలపి వెంకట రమణ అనే వ్యక్తి ఆక్రమించాడని ఆలయ కమిటీ సభ్యులు వెలిచేటి సురేష్ కుమార్, వెలిచేటి సుధాకర్ కుమార్, వెలిచేటి సింహాచలరాయుడు, వెలిచేటి రాజశేఖర్, ముంగం రమణ, గోపిన కృష్ణారావు, పిసిని అసిరప్పడు, పిసిని అప్పలనాయుడు తెలిపారు. అయితే శివాలయం కోసం ఈ స్థలాన్ని అక్రమణదారుడు నుండి తీసుకొని న్యాయం చేయాలని ఎచ్చెర్ల శాసనసభ్యులు నడుకుదిటి ఈశ్వరరావుకి కు ఆదివారం వినతి పత్రం అందించారు. ఆలయ అభివృద్ధి కోసం 70 సెంట్లు భూమిని కేటాయిస్తే సదరు వ్యక్తి ఆక్రమణ చేయడం వలన అభివృద్ధి జరగడంలేదని తక్షణమే రెవెన్యూ సిబ్బంది స్పందించి ఆలయానికి కేటాయించిన స్థలాన్ని ఇప్పించవలసిందిగా కోరారు. దీనిపై ఎమ్మెల్యే ఎన్ఇఆర్ సానుకూలంగా స్పందించి రెవిన్యూ సిబ్బందితో మాట్లాడి సర్వే చేయిస్తానని అన్నారు. అనంతరం మూడవ ఏర్పాట్లు పై కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశం ఎన్ఇఆర్ హాజరైయ్యారు ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడవ సోమవారం జరిగే అన్నసమారాధనకు ఎటువంటి ఇబ్బందిలేకుండా చూడాలన్నారు. ఆలయ అభివృద్ధిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రం శ్రీముఖలింగాన్ని దర్శించిన జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్



విశాలాంధ్ర - జలుమూరు : ప్రముఖ పుణ్యక్షేత్రం జలుమూరు మండలం శ్రీముఖలింగం ల కొలువైయున్నటువంటి మధుకేశ్వర స్వామిని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ ఆదివారం మధ్యాహ్నం సందర్శించారు ఆయనకు దేవాదాయ శాఖ కార్య నిర్వహణ అధికారి పి ప్రభాకర్ రావు సిబ్బందితో గౌరవప్రదంగా స్వాగతం పలికారు స్వామిని దర్శించే ప్రత్యేక పూజలు అనంతరం ఆలయ ముఖమండపంపై కలెక్టర్ కుటుంబ సభ్యులను అర్చకులు ఆలయ చరిత్ర శిల్ప సంపద సౌందర్యాన్ని వివరించి వారిని ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు దేవాదాయ శాఖ సిబ్బంది అర్చక సంఘం నాయకులు పలువురు పాల్గొన్నారు అద్భుత శిల్ప సంపద తిలకించిన కలెక్టర్ సంతోషించారు ఆయన కుటుంబ సభ్యులు కూడా ఇటువంటి పుణ్యక్షేత్రం దర్శించడం ఎంతో ఆనందకరమైన అన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ కేసులో ముగ్గురు అరెస్ట్

విశాలాంధ్ర - పొందూరు : మండలం దల్లవలస గ్రామంలో ఈనెల 5వ తేదీన కొంచాడ సూర్యనారాయణ కు చెందిన ద్విచక్ర వాహనం చోరీ కేసులో ఆదివారం ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. శ్రీకాకుళం పట్టణం చెందిన బొమ్మలాట మోహన్, ఎచ్చెర్ల మండలం పొన్నాడకు చెందిన మరో ఇద్దరు మైనర్లు ఈ చోరీకి పాల్పడినట్లు పేర్కొన్నారు. వీరిని లోలుగు జంక్షన్ వద్ద పట్టుకొని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం

విశాలాంధ్ర - విశాఖపట్నం : భారత రాజ్యాంగాన్ని మార్చివేసే ప్రయత్నాలు వేగంగా సాగుతున్నాయని దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత దేశ ప్రజలపై ఉందని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నేషనల్ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ జాతీయ చీఫ్ సెక్రటరీ జనరల్ ఎం. నరసింగరావు పిలుపునిచ్చారు. నగరంలోని రామా టాకీసు దరి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవన్ లో ఆదివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్, ఆల్ ఇండియా డిఫెన్స్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సదస్సును నిర్వహించారు.ఈ సందర్భంగా అంబేద్కర్,బుద్ధుని చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగాన్ని రక్షించుకుందాం.. భారతదేశాన్ని కాపాడు కుందాం.. పిలుపుతో త్వరలో దేశంలోని పలు రాష్ట్రాలలో రాజ్యాంగ అవగాహన రథయాత్రను నిర్వహించినట్లు ఆయన తెలిపారు. యాత్ర పోష్టర్ ను ఈ కార్యక్రమంలో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 4వేల కిలోమీటర్ల దూరంలో ఈ రథయాత్ర ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, కేరళ,మహారాష్ట్ర మీదుగా నాగపూర్ దీక్ష భూమికి చేరుకుంటుందని చెప్పారు. యాత్రలో దళిత, బహుజన, ప్రజాస్వామిక సంఘాలన్నీ భాగస్వామ్యం అవుతున్నాయని చెప్పారు. ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి, ఏపీ ఇంచార్జ్ మాటూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ప్రాతిపదికపై గొప్ప రాజ్యాంగాన్ని దేశ ప్రజలకు అందించారన్నారు.దీని ద్వారా అనేక హక్కులు, అవకాశాలు దేశ ప్రజలందరికీ వచ్చినప్పటికీ రాజ్యాంగాన్ని మనవాద పాలకులు మార్చివేసే ప్రయత్నం చేయటం దారుణం అన్నారు . దళిత, బహుజన, రాజ్యాధికారంతోనే సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని అందరూ ఏకం కావాలని తెలిపారు.ఈ సందర్భంగా ఇటీవల ఆంధ్ర యూనివర్సిటీ నుండి పిహెచ్‌డి అవార్డును స్వీకరించిన డాక్టర్ మాటూరి రత్న కుమారిని ఘనంగా సన్మానించారు. డాక్ యార్డ్ జనరల్ యూనియన్ కు కార్మిక నాయకునిగా గెలిచిన రమణ మూర్తిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ సౌత్ ఇండియా ఇంచార్జి , జాతీయ కార్యదర్శి జి, శంకర్, తెలంగాణ అధ్యక్షుడు ఎస్. రామలింగం, ప్రధాన కార్యదర్శి ముని కుమార్, జాతీయ కార్యదర్శి జాన్ పౌల్,ఏ పీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం రాజ్ కృష్ణ,అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కళ్యాణరావు, డి. భూపతి తదితరులు పాల్గొని ప్రసంగించారు.